# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 10 జూన్ , 2026 | పేజీలు : 07


## పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలి
### మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భారతదేశంలోని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేలా బిజేపి ప్రభుత్వం నిత్యావసరాలైన పెట్రోల్, గ్యాస్, డీజిల్ వస్తువులపై అడ్డగోలుగా పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు సబ్సీడీపై రేషన్ వస్తువులు అందించాలని మార్కెట్‌లో నల్ల బజార్‌లో కుత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి ప్రమీల, లలిత, వీణ, భానుశ్రీ, శృతి, లలిత, కృష్ణవేణి, మౌని, అరుణ, సునిత, జ్యోతి, ఎస్‌కె మైబు, శ్రీలక్ష్మి, శ్రీరాణి, సీత, అనిత, రుక్మిణి, తిరుపతమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ఖర్చులు ఫుల్లు... గుండె ఝల్లు

### వామ్మో జూన్... ఇటు తల్లిదండ్రులు.. అటు రైతన్నలు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** జూన్ మాసం వచ్చిందంటే ఖర్చులు ఫుల్లుగా ఉండడంతో ఇటు తల్లిదండ్రులు అటు రైతన్నల గుండెలు జల్లుమంటున్నాయి. వేసవి సెలవులు ముగిసి విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో తమ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులకు, ఖరీఫ్ సీజన్ సాగుకు రైతన్నలు సిద్ధం కావడంతో పంట పెట్టుబడితో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు జూన్ మాసం ఆర్థిక పెనుభారంగా మారడంతో జూన్ అంటేనే **వామ్మో అంటున్న పరిస్థితి.**

విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేతిలో చిల్లుగవ్వ లేకున్నా మంచి విద్యను అందించేందుకు ప్రైవేటు, కార్పోరేట్ సంస్థల్లో చదివించేందుకు అప్పు చేసి మరి అందులో చేర్పిస్తున్నారు. ఇది ఆసరాగా చేసుకొని యాజమాన్యాలు కూడా ఫీజులు అధికంగా పెంచి వసూళ్లు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో నర్సరీ చదువులు కనీసం రూ.25వేల నుండి మొదలుకొని 10వ తరగతి వరకు లక్షాయాభై వేల వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఫీజు పరిస్థితి ఇలా ఉంటే పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, షూ, రవాణా ఖర్చులు అదనంగా వేలల్లో ఖర్చు అవుతుంది. ఇంటర్ నుండి పై చదువులు చదివే విద్యార్థుల ఫీజులు లక్షల్లో ఉన్నాయి. ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఫీజులను రూ.50వేల నుండి మొదలకొని రూ.2.5 లక్షల వరకు వసూలు చేయడంతోపా టు అదనంగా పుస్తకాలు, స్పెషల్ ఎగ్జామ్స్ నిర్వహణ, ల్యాబ్, ఎన్విరాన్‌మెంట్ పరీక్షల పేరుతో అదనంగా వేలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.

**వ్యవసాయ పెట్టుబడులు...**

తొలకరి వర్షాలు మొదలుకావడంతో రైతులు పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. మెట్ట సాగు రైతులు తమ పంట భూములను చదును చేసుకునే పనిలో బిజీ అయ్యారు. గత ఏడాదితో పోలిస్తే పంట సాగు పెట్టుబడులు ఘననీయంగా పెరిగాయి. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంతో డిజిల్, పెట్రోల్ ధరలు గత ఏడాదితో పోలీస్తే లీటర్‌కు రూ.10లకు పైగా పెరగగా ఎకరం భూమి సాలుఇరువాలు దున్నినందుకు ట్రాక్టర్ యజమానులు గత ఏడాది రూ.2వేలు తీసుకోగా నేడు రూ.2,500కు పెంచారు. పత్తి విత్తనాలకు 300 గ్రాములు ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.600 నుండి 800 వరకు కంపెనీని బట్టి పెరిగిన పరిస్థితి. కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూడా బస్తాకు రూ.200 నుండి 300 వరకు పెరిగాయి. సగటున గత ఏడాదికన్నా సాగు ఖర్చు 30 శాతం పెరగడంతో రైతులపై తీవ్రమైన ఆర్థిక భారం పడనుంది.

## పాఠశాల, హాస్టళ్ళల్లో సమస్యల్ని పరిష్కరించి సిద్ధం చేయాలి
### అనుములలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/హాలియా:** పాఠశాలల ప్రారంభం నాటికి వాటిల్లో నెలకొన్న సమస్యలను,వసతి గృహాలను పరిశుభ్రం చేసి విద్యార్థులు ఉండేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం అనుముల మండలంలోని పాఠశాలలను,వసతి గృహాలను,తాగునీటి ట్యాంకులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీలలో ముందుగా నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలించి వాటిలో నెలకొన్న సమస్యలను జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. వైద్య పరికరాల నిమిత్తం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 65 లక్షల రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని డాక్టర్ మాతృ కలెక్టర్‌కి చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలలను తనిఖీ చేసి టాయిలెట్లు,తాగునీటి వసతి,భవనంలో నెలకొన్న చిన్న చిన్న సమస్యల్ని పరిష్కరించి బాలికలు వచ్చే నాటికి వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డీఈవో సుశీందర్ రావు, అధికారులను ఆదేశించారు.అమృత్ స్కీం కింద నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకులను రేపు సీజన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదేనని ఆయన చెప్పారు.కార్మికుల సమస్య ఉంటే ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి తక్షణం పనులను పూర్తి చేసి తాగునీటి ట్యాంకులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఎస్ఈ వెంకటేశ్వర్లు, శైలజ,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ తదితరులు ఉన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని
# ముగ్గురు దుర్మరణం







**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండల పరిధిలో చోటుచేసుకున్న ఒక ఘోర రహదారి ప్రమాదంలో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా అత్యంత వేగంతో ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయి మూడు కుటుంబాల్లో అంతులేని తీవ్ర విషాదం మిగిలింది. నార్కట్‌పల్లి అద్దంకి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని వాడపల్లి గ్రామ శివారులో మంగళవారం ఈ ఘోర సంఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించిన వివరాలను దామరచర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. వాడపల్లి గ్రామానికి చెందిన బత్తుల ధనుంజయరావు (42), ఉప్పుతల నర్సింహారావు (38) లు ఇరువురు ఒక సిమెంట్ పరిశ్రమలో లారీలకు సిమెంట్ ఎగుమతి చేసే కూలీ పనుల నిమిత్తం గత కొద్ది రోజులుగా క్రమం తప్పకుండా వెళ్తున్నారు. రోజువారీ మాదిరిగానే వారిద్దరూ ద్విచక్ర వాహనంపై పనుల నిమిత్తం బయలుదేరారు. వారు గ్రామ శివారు నుండి దామరచర్ల వైపునకు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి లారీ యార్డ్ సమీపంలోకి చేరుకున్నారు.అదే సమయంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన జెక్క వెంకటేష్ (25) దామరచర్ల నుండి గుంటూరు వైపునకు తన ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో అత్యంత వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న ధనుంజయరావు వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాద తీవ్రతకు రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. వాహనాలు నడుపుతున్న ధనుంజయరావు, వెంకటేష్ ల ముఖాలకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్ వెనుక కూర్చున్న నర్సింహారావు తలకు కూడా బలమైన గాయాలు కావడంతో ప్రమాద స్థలి అత్యంత భయానకంగా మారింది. ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన వెంకటేష్, నర్సింహారావులను 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందాడు.నర్సింహారావు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. మృతుడు బత్తుల ధనుంజయరావుకు భార్య సైదమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మరో మృతుడు ఉప్పుతల నర్సింహారావుకు భార్య అంజమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంగ్ రూట్‌లో వచ్చిన మృతుడు జెక్క వెంకటేష్‌కు ఇంకా వివాహం కాలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించి మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# తాటి చెట్టుపైనే కార్మికుడు గుండెపోటుతో మృతి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (మద్దిరాల) :** తాటి చెట్టు పైనే గుండెపోటు రావడంతో గీతకార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మద్దిరాల గ్రామం లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల గ్రామానికి చెందిన చామకూరి వెంకన్న (56) నిత్యం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో చెట్టు పైనే మృతి చెందారని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానాకు తరలించారు.

# మేకల వెంకటేశ్వర్లు మృతి బిజెపికి తీరనిలోటు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బిజేపి సీనియర్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు మృతి బిజేపి పార్టీకి తీరనిలోటు అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో ఆయన నివాసంలో ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి బిజేపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం నేరేడుచర్ల వాస్తవ్యులు రిటైర్డ్ టీచర్ చావ వీరభద్రరావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు బొబ్బా బాగ్యరెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ:** అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్ లు అన్నారు. మంగళవారం కోదాడలోని స్థానిక లాల్‌బంగ్లాలో అఖిల భారత రైతుకూలి సంఘం జిలా కమిటి ఆధ్వర్యంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో కోదాడ లాల్ బంగ్లాలో అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర అఖిలభారత రైతు కూలి సంఘానికి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలుగుబెల్లి వెంకన్న, పారెల్లి నాగయ్య, మేకల కనకరావు, దశరథ, దుద్య, వి.నర్సింహరావు, గండు నగేష్, లక్ష్మయ్య, మద్దల వెంకన్న, వీరబాబు, విజయ్ పాల్గొన్నారు.



# ప్రతీ రైతూ భూసార పరీక్షలు చేయించుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** ప్రతిరైతు భూసార పరీక్షలు చేయించుకుని భూమికి అవసరమైన పోషకాలను, ఎరువులను మాత్రమే వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ తెలిపారు. మంగళవారం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు వ్యావసాయ శాఖ తరుపున నేల సంరక్షణ, నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కెవికె గడ్డిపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త మంగళవారం నాడు ఖేత్ బచావో అభియాన్ పై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త ఆదర్శ మాట్లాడుతూ భూసారాన్ని కాపాడటానికి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని చేయాలన్నారు. భూసార పరీక్షకు మట్టి నమూనాను సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందని, వీటి వాడకాన్ని తగ్గించి, సేంద్రియ, సహజ వ్యవసాయం పద్ధతులను అవలంభించేలా రైతులకు అవగాహన కల్పించారు. దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, కార్యదర్శి గంద్ర బాలరాజు, రైతులు లక్ష్మయ్య, వినోద్, వెంకన్న, పెద్ద వెంకన్న, కేసగాని వెంకన్న, కారింగుల సైదులు, వీరబోయిన శ్రీను, బొబ్బయ్య, బొమ్మ వెంకటేశ్వర్లు, రేవూరి బాబు, నారయ్య, వెంకన్న, కొమ్ములయ్య, చుక్కయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

# కొలాయిడ్ సిస్టును తొలగించిన మలక్‌పేట యశోద వైద్యులు




**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మెదడులో అత్యంత అరుదుగా కనిపించే కొలాయిడ్ సిస్టుతో బాధపడుతున్న మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన అంకటి విజయ (46)కు మలక్‌పేట యశోద ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక ఎండోస్కోపిక్ శస్త్ర చికిత్స నిర్వహించి కొత్త జీవితం ప్రసాదించారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్ల, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్‌లు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మెదడు మధ్యభాగంలో ఏర్పడిన ఈ సిస్టు కారణంగా సెరెబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. సదరు మహిళ కొంత కాలంగా తీవ్ర తలనొప్పితో బాధపడుతుండగా వైద్య పరీక్షల్లో మెదడులో కొలాయిడ్ సిస్టు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స ద్వారా సిస్టును పూర్తిగా తొలగించినట్లు వివరించారు. చికిత్స ఆలస్యమైతే ప్రాణాపాయం కలిగించే అవకాశముంటుందన్నారు. తలనొప్పి, చూపు మందగించడం, జ్ఞాపకశక్తి సమస్యలు, నడకలో అసమతుల్యత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలని సూచించారు. రోగి ప్రస్తుతం పూర్తిగా కోలుకొని సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నట్లు వైద్య బృందం తెలిపారు. యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో ప్రపంచ స్థాయిలో న్యూరో, న్యూరో సర్జరీ సేవలను అత్యాధునిక సదుపాయాలతో అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి మార్కెటింగ్ అధికారులు వాసు కిరణ్ రెడ్డి, స్వాగత్ కుమార్ పాల్గొన్నారు.

# అవినీతిపై బహిరంగ చర్చలకు సిద్ధమేనా...



**ప్రజాపక్షం/కోదాడ:** మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేసిన అరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ అక్కసుతో చేసిన వ్యాఖ్యలేనని కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెళ్ల కృష్ణారావు, మైలారిశెట్టి భాస్కర్ లు తీవ్రంగా ఖండించారు. కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తన మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగంగా నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించడం సులభమేనని, అయితే ఎవరైన అధికారి ముడుపులు ఇచ్చినట్లు అధారాలతో నిరూపించగలరా అని ప్రశ్నించారు. ముడుపులు ఇచ్చిన అధికారి ఎవరో ప్రజల ముందుకు తీసుకరావాలని డిమాండ్ చేశారు. దొంగే దొంగ అన్న చందంగా మాజీ ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన హాయంలోనే అవినీతి, అక్రమ వసూళ్లు జరిగాయనే అరోపణలు అప్పట్లో పత్రికల్లో వచ్చాయని గుర్తు చేశారు. అధికారుల నుంచి అక్రమ వసూళ్లు జరిగాయంటూ అప్పట్లో అనేక కథనాలు వెలువడ్డాయని వాటిపై ప్రజల్లో తీవ్ర చర్చ జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు అందరిని గమనిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తే మరోసారి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పుట్టిన ప్రతీ ఆడ బిడ్డకు రూ. 5వేల కానుక



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని కరివిరాల గ్రామంలో సర్పంచ్ మారోజు పార్వతమ్మ వెంకటచారి ఆడబిడ్డకు జన్మనిస్తే ఆ కుటుంబానికి ఐదువేల రూపాయలు కానుకగా ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 11న ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో మహిళలను చులకనగా చూసే ఈ సమాజంలో మార్పు రావాలని దృడ సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకు అండగా ఉండి వారి అభ్యుదయ కోసం తోడ్పడతానని ఆమె తెలిపారు. ఎలాంటి రాజకీయ, కుల, మత లబ్ధి కోసం కాకుండా కేవలం ఆడవారి పట్ల ఉన్న గౌరవంతోనే ఈ పథకంను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.



# రైతుల సంక్షేమమే ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రైతుల సంక్షేమమే ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మార్కెట్ అభివృద్ధి, రైతులకు అందించాల్సిన సౌకర్యాలు, రానున్న సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లపై డైరెక్టర్లతో విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కమిటిపై ఉందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఫసియోద్దీన్, డైరెక్టర్లు ఆర్తి కేశవులు, చెన్నోజు నర్సింహాచారి, నకిరేకంటి బాలకృష్ణ, పచ్చిపాల వెంకన్న, షేక్ అబ్దుల్ కరీం, మాడ్గుల నవీన్, ఉప్పల సత్యనారాయణ పాల్గొన్నారు.

# సిపిఐ ధర్నాను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10న జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు. గ్యాస్‌పై ఇప్పటికే 89 రూపాయలు, పెట్రోల్, డీజిల్‌పై పది రూపాయలు పెంచారని, దీనికి ముగింపు లేకుండా పోయిందని, ధరలు పెంచుకుంటూ సామాన్యుడి మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. చిలకరాజు శ్రీను, పరికె భరత్ ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా కక్కిరేణి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సుధాబ్యాంక్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కక్కిరేణి చంద్రశేఖర్ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కక్కిరేణి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియమించిన అమరవాది లక్ష్మినారాయణకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన సందర్భంగా పలువురు ఆర్యవైశ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# బిఆర్‌ఎస్ కార్యకర్తను పరామర్శ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని గారకుంటతండా గ్రామానికి చెందిన గుగులోతు హాంజీనాయక్ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని అపెక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధిత కుటుంబ సభ్యులను మలిదశ ఉద్యమకారులు, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్, బిఆర్ఎస్ నాయకులు గుగులోతు నీలా హేమ్లానాయక్ పరమార్శించారు. అనంతరం బాధితునికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే డాక్టర్లను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి వెంకట్రాంనాయక్, రవీందర్‌నాయక్, సందీప్‌నాయక్, పులియానాయక్, నెహ్రూ నాయక్, పాల రవీందర్, బచ్చలకూరి కోటయ్యా, కరుణాకర్, వీర్లానాయక్, శ్రీరంగం బాలు పాల్గొన్నారు.




## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు నేతృత్వంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పాఠశాల కరపత్రాలతో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ మహమ్మద్ షాహిన్, ఇంజమూరి వెంకటమ్మలతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు నిర్వహించిన పరీక్షల ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, బికోజి, రామ్మూర్తి, బాలు, శ్రీను పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసానే లక్ష్యం

**ప్రజాపక్షం/నడిగూడెం:** రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం నుండి హైద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే సిఎం సభకు మహిళ సమాఖ్య సభ్యులతో బయలుదేరుతున్న బస్సును ప్రారంభించారు. సభకు తరలివెళ్లిన వారిలో ఎపిఎం దుర్గప్రసాద్, సిసి శ్రీనివాసరావు, వివోలు, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత న్యాయ సేవలే లక్ష్యం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పేదలు, బడుగు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని అడ్వకేట్ మహేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైద్రాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయనను హుజూర్‌నగర్ అదనపు జ్యూడిషియల్ ఫ్లస్ట్ క్లాస్ మేజిస్టేట్ కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా) గా మూడు సంవత్సరాల కాలానికి నియమించారు. మండల కేంద్రమైన గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగి వార్షిక ఆదాయం లక్షలోపు ఉన్న అర్హులైన పేదల ప్రజలకు న్యాయ సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల అరెస్ట్

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా మంగళవారం భువనగిరి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులను భువనగిరి పట్టణ పోలీస్ లు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ల హామీలను నెరవేర్చనందుకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిలదీస్తారని భయంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేయడం దారుణమాని పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఖాజా అజీమోద్దిన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు కాజం, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు పెంట నితీష్ ఉన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వ వైఖరి సరికాదు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యనించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదికల మీద, టివి చానల్‌లో, సోషల్ మీడియాలో కాంగ్రెస్, బిఆర్ఎస్ లు ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకుంటున్నాయని తమ పరిపాలనే బ్రహ్మాండంగా ఉందని తమకు తామే కితాబు ఇచ్చుకుంటున్నారని కాని వాస్తవాలు పరిశీలిస్తే రెండు ప్రభుత్వాలు పెద్ద తేడా ఏమీలేదని అన్నారు. నిరుద్యోగ బృతి విషయంలో, వితంతువులకు వికలాంగులకు ఇచ్చే పెన్షన్ విషయంలోనూ, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్‌లో రెండు ప్రభుత్వాలు పని విధానం ఒకే విధంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు బిల్లు చెల్లించే విషయంలో నానా యాతన పెడుతున్నారని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, తిరపతయ్య, ఎస్‌కె మస్తాన్, నర్సయ్య, శ్రీకాంత్, భరత్ పాల్గొన్నారు.

## ఉత్తమ్‌దంపతులపై నిరాధారణమైన ఆరోపణలు చేసినందుకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లపై నిరాధరమైన అరోపణలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్ లు స్థానిక డిఎస్‌పికి ఫిర్యాదు చేశారు. మంగళవారం కోదాడ డిఎస్‌పి కార్యాలయలో డిఎస్‌పి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేసి అనంతరం మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో వేలాదికోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ రాజకీయ లబ్ధికోసం నిరాధరమైన ఆరోపణ చఏయడం సరైందికాదన్నారు. అవినీతి, అరోపణలపై ఆధారాలు ఉంటే సంబంధిత అవినీతి నిరోదక శాఖలకు ఫిర్యాదు ఏయాలని, లేదా ప్రజాక్షేత్రంలో ఆధారాలను బహిర్గతం చేయాలి తప్ప, స్థానిక ఎమ్మెల్యేను, అధికారులను కించపర్చే విధంగా వారిపై అవినీతి అరోపణలు చేయడం మానుకోవాలన్నారరు. రాజకీయ లబ్ధికోసం కోదాడ నియోజకవర్గంలో ప్రభుత్వం అధికారులను, అధికార పక్ష నాయకులపై నిరాదరమైన అరోపణలు చేసి రాజకీయ లబ్ధి చేకూరాలని ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో మైలారిశెట్టి భాస్కర్, పాలడుగు సంజీవ్, షరీఫ్, బాగ్దాద్, కామళ్ల ప్రవీణ్, పిడతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెరిగిన మార్కెట్ విలువలతో ప్రజలకు భారంగా రిజిస్ట్రేషన్లు




**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూములు, స్థలాల మార్కెట్ విలువలను భారీగా పెంచడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భువనగిరి డాక్యుమెంటరీ రైటర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు అన్నారు. పెరిగిన భూముల రేట్లు తగ్గించాలని కోరుతూ మంగళవారం భువనగిరి సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెరిగిన మార్కెట్ విలువల కారణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీలు గణనీయంగా పెరిగి ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు భూముల కొనుగోలు, అమ్మకాల విషయంలో వెనుకడుగు వేస్తున్నారన్నారు. ఫలితంగా రియల్ ఎస్టేట్ లావాదేవీలు మందగించి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పనులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ పరిస్థితుల ప్రభావం డాక్యుమెంట్ రైటర్లపై తీవ్రంగా పడుతోందని వాపోయారు. రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని పునఃసమీక్షించి పెంచిన మార్కెట్ విలువలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మార్కెట్ విలువలను నిర్ణయించాలని, రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రజలకు అనుకూలంగా మార్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్కెట్ విలువల పెంపుపై పునరాలోచన చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ శ్రీనివాస్, ఆబీద్ అలీ, ఎండి రఫియుద్దిన్, షాకీర్, భాస్కర్, మనోజ్, వసంత, ఆదిల్, హరీష్, కరీముద్దీన్, శ్రీకాంత్, మల్లేష్, సుదీర్, సాయి, యుగేందర్, నవీన్, మహేష్, అశోక్, దేవేందర్, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మండలంలోని పాఠశాలలకు చేరుకున్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలకు కూడా పాఠ్యపుస్తకాల సరఫరా వేగంగా కొనసాగుతుంది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు పుస్తకాల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు తొలి రోజున పాఠ్యపుస్తకాలు అందజేసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్, సామాజికశాస్త్రం, తదితరాన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.





## పెంచిన ధరలను తగ్గించాలి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కెఆర్ భవన్‌లో మంగళవారం రైతు సంఘం మోత్కూర్ మండల నాల్గవ మహాసభ మొగుళ తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతులకు సకాలంలో రైతుబంధు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు మొగుళ్ల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పైల సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దొండ ఎల్లయ్య, సహాయ కార్యదర్శి కొడమంచి వీరస్వామి, కోశాధికారి కొమ్ము రాములులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మోత్కూర్ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, సహాయ కార్యదర్శి పులకర మల్లేష్, కళ్లెం నరసయ, కొల్లు లక్ష్మయ్య, ఎర్రబాబు, బుష్పాక అంజయ్య, కట్కూరి జగన్మోహన్ రెడ్డి, మదూరి సోమిరెడ్డి పాల్గొన్నారు.

## సామాజిక ఉద్యమాల సృష్టికర్త ఎంఆర్‌పిఎస్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సామాజిక ఉద్యమాల సృష్టికర్త ఎమ్మార్పీఎస్ ఉద్యమమని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి అధ్యక్షతన సమావేశం నిర్ణయించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దుబ్బ రామకృష్ణ పాల్గొని వారు మాట్లాడుతూ ఈ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా భారతదేశంలో అనేకమైన సామాజిక ఉద్యమాలు సృష్టించి విజయం సాధించిన చరిత్ర ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంస్థాన్ నారాయణపూర్ మండల కన్వీనర్‌గా పంది రాకేష్‌ను, మండల కో కన్వీనర్ గా చెరుకుపల్లి హరికాంత్ ను జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ ప్రకటిచి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, అడ్వకేట్ కట్టెల లింగస్వామి, మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు కలకొండ సంజీవ, ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్, సీనియర్ నాయకులు వలిగొండ యాదయ్య, ఆర్.బి రాములు, కట్టెల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం...

**ప్రజాపక్షం/భువనగిరి :** ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ ఆదేశానుసారం మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు కళాశాలల యాజమాన్యాలు తమ ఇష్టాను రీతిగా వసూలు చేస్తున్నారని విన్నవించారు. ప్రతి సంవత్సరం పిల్లలు చదువుకున్న వారు కడుతున్న ఫీజుల పైనే యాజమాన్యాలు దృష్టి పెడుతూ నిబంధనలకు విరుద్ధంగా ట్యూషన్ ఫీజు తో పాటు యూనిఫామ్, పుస్తకాలు యాక్టివిటీస్ పేరుతో రకరకాలుగా ఫీజులు వసూలు చేయడంతో తల్లిదండ్రులు ఆ భారాన్ని మోయలేక పోతున్నారు అని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసగల్ల రమేష్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఉప్పలయ్య మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్ మాదిగ, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు వడ్లకొండ శ్రీకాంత్, తుర్కపల్లి మండలాధ్యక్షులు మోత్కుపల్లి రవి పాల్గొన్నారు.





## బస్వాపూర్ రిజర్వాయర్ భూ బాధితులకు న్యాయం చేయాలంటూ వినతి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రిభువనగిరి జిల్లాలో చేపట్టే బస్వాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టులో భూములు,ఇండ్లు, కోల్పోతున్న బాధికులకు న్యాయం చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తుర్కపల్లి మండలం చోక్ల తండా గ్రామ సర్పంచ్ భూక్య రాజారామ్ నాయక్ వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ, జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సిఎంను కలిసి తమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోతున్న చోక్ల తండా, కోక్య తండా, పిర్య తండా గ్రామ ప్రజలకు నష్ట పరిహారం అందించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేసి పునరావాసం కల్పించాలని కోరారు. పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని సర్పంచ్ రాజారామ్ నాయక్ విన్నవించారు.

## పెంచిన ధరలు తగ్గించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల సామాన్యుడికి బ్రతుకు, భారంగా మారిన వంటగ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని రామన్నపేట మండల సిపిఐ కార్యదర్శి ఊట్కూరి నరసింహ ఒక ప్రకటన తెలిపారు. అచ్చే దిన్ వస్తాయని చెప్పి సామాన్య మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెరిగిపోతున్నందులకు నిరసనగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెంచినధరలు తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో మండలంలోని అన్ని గ్రామశాఖల నుండి పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## చండూరులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం చండూరు మున్సిపాలిటీ కమీషనర్ మల్లేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ మాట్లాడుతూ సమాజంలో మారుతున్న జీవన పరిస్థితుల్లో వ్యాయామం తప్పనిసరి అయ్యిందని అన్నారు. వ్యాయామం ద్వార శారీరక దృఢత్వంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉపయోగపడుతుందని అన్నారు. సత్వరమే మున్సిపాలిటీ కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కమీషనర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు జెల్ల శ్రీనివాసులు , ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కొండ్రెడ్డి సాయి కుమార్ , పల్లె రాజు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్యసాధనకు కృషి చేస్తేనే ఉన్నత శిఖరాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని,దాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని నల్లగొండ జిల్లా అడిషనల్ ఎస్పి రమేష్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభకు పురస్కారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నేషనల్ ట్రెజరర్ నూనె సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్ ప్రెసిడెంట్ కోట సరిత, నేషనల్ డైరెక్టర్ కోట్ల సాయికిరణ్, రీజియన్ సెక్రటరీ గూడూరు అంజిరెడ్డి, జాయింట్ సెక్రటరీ నారాయణ కవిత, రవీంద్రాచారి, మాధవి, బాలు, నాగేశ్వరరావు, లక్ష్మణ్, సరస్వతి,భీష్మాచార్య,విజయ్,భాస్కరరావు, గోపాలరావు,వెంకటేశ్వరరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.అనంతరం జిల్లాలోని 33 మండలాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మోమెంటోలు, శాలువాలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే ప్రతీ విద్యార్థికి వేయి నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.

## 80 ఏళ్ల పోరాట ప్రస్థానంతో ఉపాధ్యాయుల అండగా ఎస్‌టియు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యా,ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే ఎస్‌టియూ ప్రధాన లక్ష్యమని ఆసంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ తండు భాను ప్రకాశ్ గౌడ్ అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియూటీఎస్)80వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని ఎస్‌టియూ భవన్‌లో మంగళవారం పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాతూ 1947లో స్థాపితమైన ఎస్‌టియూ సంఘం ఎనిమిది దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం,విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఉపాధ్యాయుల వేతనాలు,పదోన్నతులు,సేవా భద్రత వంటి అంశాలపై అనేక పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కందిమళ్ల నరేందర్ రెడ్డి,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.దత్తేశ్వర్,జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె సమీనా, ఎం.డి. జాన్ ఖాన్,జి విజయప్రసాద్,ఎం.వెంకటేశ్వర్లు,కె.పర్వతాలు,డి.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అదనపు ఇసి మెంబర్‌గా ఈశ్వరయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తన సేవలను గుర్తించి ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అదనపు ఈసీ మెంబర్‌గా నియమించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో సమాజ సేవలో మరింత ముందుంటానని ఈసీ మెంబర్ బుక్కా ఈశ్వరయ్య పేర్కొన్నారు.నల్లగొండ పట్టణానికి చెందిన బుక్కా ఈశ్వరయ్యను ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అదనపు ఈసీ మెంబర్‌గా నియమిస్తూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణమంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు.నిత్యం సమాజ సేవలో,సంఘసేవలో అనేక కార్యక్రమాలు చేస్తూ, రెడ్ క్రాస్ సంస్థలో గోల్డ్ మెడల్ పొందిన ఈశ్వరయ్య సేవలను గుర్తిస్తూ మహాసభ అదనపు ఈసీ మెంబర్‌గా ఆయనను నియమించారు.రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభలో గత 30 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పని చేసి సంఘ పటిష్టతకు కృషి చేస్తున్నారు.గతంలో మూడు పర్యాయాలు పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ ధర్మకర్తగా పనిచేశారు.ఆయన ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం హెచ్‌డీపీ మెంబర్‌గా కొనసాగుతున్నారు.

## ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల నియంత్రణకు విద్యాధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యశ్వంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల విద్యాధికారి ధర్మానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 2026/27 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నందున మిర్యాలగూడ మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాల యజమానులు ఇష్టానుసారంగా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి అధిక ఫీజులు వసుళ్ళకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పాఠశాలలోనే అమ్ముతూ వ్యాపారానికి పాల్పడుతున్నారని అన్నారు. పేద విద్యార్థులు తల్లిదండ్రులు మా పిల్లలకు మంచి విద్యాభ్యాసాలు అందించాలని వాళ్లు కష్టనష్టాలకు ఓర్చి ప్రైవేటు స్కూలు యాజమాన్యం చెప్పిన విధంగా ఫీజులు కడుతూ ముందుకుపోతున్నారని. ప్రైవేట్ స్కూలు యాజమాన్యాలకు ఒక సర్కిలర్ జీవో పాస్ చేసి స్కూల్ ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారో స్కూల్ బోర్డుపై పెట్టే విధంగా తమరు చూడాలని అన్నారు. ఒకవేళ అధిక ఫీజులు వసూలు చేసినటువంటి ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఆంగోత్ అనిల్, సీలి వినయ్, పేరుపాక సంతోష్, ఎండి.రఫీ, సిహెచ్ కిరణ్, అబ్దుల్, బసక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం /భువనగిరి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఉద్యోగాల భర్తీపై శ్వేత పత్రం విడుదల చేయాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం ః** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విద్య రంగాన్ని బలోపేతం చేయడం తనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిమంది యువత ఉన్నత విద్యను పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్త చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు పరోక్షంగా వత్తాసు పలుకుతూ విద్యార్థులు ,తల్లి దండులను ఆర్థికంగా దోపిడీ చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు విప్లవకుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు లోడే నితిన్ కుమార్, ఏఐవైఎఫ్ మండల కో కన్వీనర్ గడ్డం యాది, స్టాలిన్, చరణ్ తేజ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని శ్రీశ్రీనివాస నర్సింగ్ హోమ్ మంగళవారం డాక్టర్ రాపోలు ట్రస్ట్ ఆధ్వర్యంలో నలోగ్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ ఆర్‌మంజుల, ఐఎంఏ నకిరేకల్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రఘునందన్,సమక్షంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.దీనికి విశేష స్పందన లభించింది.ఈశిబిరంలో 200 మందికి ఉచిత సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా,థైరాయిడ్ స్క్రీనింగ్,ఎముకల సాంద్రత (బోన్ డెన్సిటీ) పరీక్షలు క ఉచితంగా నిర్వహించారు.అలాగే 100 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మహిళల ఆరోగ్య సంరక్షణలో భాగంగా 70 మందికి హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాలను రాయితీ ధరకు అందజేశారు.ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు





## గంజాయితో పట్టుబడ్డ నిందితులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ముగ్గురు వ్యక్తులు రాంపూర్ గ్రామ శివారులో కాలువ ప్రక్కన అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నారన్న సమాచారం మేరకు, తుర్కపల్లి ఎస్ఐ తక్ యుద్దీన్, తమ సిబ్బందితో ముగ్గురు అనుమానితులని అదుపు లోకి తీసుకొని విచారించగా, వారి వద్ద సుమారు 250 గ్రాముల గంజాయి దొరికిందని, సదరు నిందుతులు కర్కపట్ల నుండి గంజాయిని కొనగోలు చేసి తుర్కపల్లికి తరలించి అమ్ముతున్నారని తెలిపారు. పోలీసులకు పట్టుబడ్డ నిందితులు మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామానికి చెందిన గిరిమిల్ల సాయి మధు,తుర్కపల్లి మండలం రాంపూర్ కడీలబావి చెందిన పసుల లింగస్వామి, సయ్యద్ జావీద్ వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి, 250 గ్రాముల గంజాయి,పల్సర్ మోటార్ వెహికల్,(3) మొబైలు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తుర్కపల్లి ఎస్సై తెలిపారు.

## ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డును అయ్యప్ప డిజిటల్ ఫోటోగ్రాఫర్ చిత్రియాల గ్రామానికి చెందిన సుగూరి మంజునాథ్‌గౌడ్ అందుకున్నారు. మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు అందుకున్న మంజునాథ్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, స్నేహితులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమ గుప్త నిధుల తవ్వకాలపై ఉక్కుపాదం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలోని ఎడవెల్లి గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం,గుమ్మటం దర్గా వద్ద గత రెండు రోజుల క్రితం జరిగిన అక్రమ గుప్త నిధుల తవ్వకాలపై తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్ రావు స్పందించారు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి విచారణకు ప్రత్యేక అధికారిని నియమించి వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.నిందితులు ఎంత పెద్దవారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు అని  చ్చరించారు.పురాతన,ప్రాచీన సంపదను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత ఇలాంటి అక్రమ తవ్వకాలకు పాల్పడితే సహించేది లేదు స్పష్టం చేశారు.ఈ ప్రాంతంలో పోలీస్ శాఖ నిఘా ఉంచాలని,అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను సంపూర్ణంగా పూర్తి చేశామన్నారు. త్వరలో మంత్రుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు అధికారికంగా అందిస్తామని చెప్పారు. గతంలో రాజీవ్ గృహకల్ప పథకం కింద మంజూరైన ఈ స్థలంలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణ పేరుతో పది సంవత్సరాల్లో మూడు సార్లు ప్రత్యేక నిధులు చేయించి నిర్మాణ పనులు పూర్తి చేయకుండా పేదలను మభ్యపెట్టిందన్నారు. బిఆర్ఎస్‌కు రాజకీయమే తప్ప ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేసారని విమర్శించారు. పేదల సొంతింటి కల నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించడం జరిగిందన్నారు. ఆయన వెంట డిసిసి జనరల్ సెక్రటరీ చిలుకూరు బాలకృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్ల పల్లి రవి, సర్పంచ్ బెజ్జం సాయి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు నిర్ధారించిన ధరలకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వలోజు వినోద్ కుమార్ అన్నారు. మిర్యాలగూడ ఎడిఎ కొనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం స్థానిక రైతు వేదికలో మిర్యాలగూడ డివిజన్ ఇన్పుట్ డీలర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేకుండా వ్యాపారం ప్రారంభించరాదన్నారు. రెన్యూవల్ చేయించు కొనుటకు 30 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్సులు దుకాణంలో కనిపించేటట్లు ప్రదర్శించాలన్నారు. దుకాణం పేరు, డోర్ నెంబరు తప్పనిసరిగా పెయింట్ చేయించాలన్నారు . వ్యాపార సంస్థ పేరు కనబడేటట్లు ప్రదర్శించాలని, పెయింటుతో వ్రాయించాలన్నారు. నిల్వ పట్టిక, ధరల పట్టిక తప్పనిసరిగా కొనుగోలు దారులకు కనడేలా ప్రదర్శించాలన్నారు. ప్రతి రోజు నిల్వ పట్టిక తప్పనిసరిగా అప్డేట్ చేయాలన్నారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్ యాక్ట్ గురించి వివరించారు. సమావేశంలో మిర్యాలగూడ, వేములపల్లి, అడవిదేవులపల్లి, దామెరచర్ల, మాడ్గులపల్లి మండలాల వ్యవసాయ అధికారులు యం.రుషేంద్రమని, జి.సరిత, శివరాం, కిషోర్, బాలకృష్ణ , ఎఇఓలు రమేష్, నాగయ్య, శ్రీకాంత్, వెంకటరెడ్డి, ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జవహర బాబు, శ్రీధర్ రెడ్డి, రామ్ రెడ్డి, అశోక్ రెడ్డి ఉన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిన మేకల కాపరిని కాపాడిన 108 సిబ్బంది

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని కొండాపూర్ కు చెందినమేకల కాపరి అంగడి రాములు ప్రమాదవశాత్తు మేకను కాపాడ బోయి వ్యవసాయ బావిలో జారి పడగా చుట్టు ప్రక్కల రైతులు గమనించి 108 అంబులెన్సుకు, పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 అగ్నిమాపక సిబ్బంది చొరవతో బావిలోకి నిచ్చెనను ఏర్పాటు చేసి రాములును అతి జాగ్రత్తగా బయటకు తీశారు. బావిలో పడిపోయిన రాములుకు గాయాలు కావడం వలన 108 అంబులెన్స్‌లో ప్రథమ చికిత్సను అందిస్తూ మెరుగైన చికిత్స కోసం భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సరియైన సమయంలో స్పందిం చిన 108 సిబ్బందికి అగ్నిమాపక సిబ్బందికి బావిలో పడిపోయి ఉన్న రాములు ప్రాణాలను కాపాడినందుకు అక్కడికి వచ్చిన ప్రజలు, గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం రాములు యొక్క ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటన స్థలానికి 108 సిబ్బంది ఆలేటి పైలెట్ మహేందర్ రెడ్డి ఈ ఎం టి ఆత్మకుంట రాకేష్ లను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వేధింపులకు, దాడులకు గురైన వారికి బరోసా, ధైర్యం కల్పించాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ షీ టీమ్స్, భరోసా సెంటర్స్ సిబ్బందికి సూచించారు. మహిళా, పిల్లల రక్షణ చట్టాలు, శిక్షల గురించి అవగాహన కల్పించాలని భరోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి వెంట గల మహిళా భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాలను ఆయన సందర్శించి కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. సిబ్బంది నిర్వహిస్తున్న పనులు, మహిళలు, పిల్లల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలు, కౌన్సిలింగ్ నిర్వహణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. దాడులకు, వేధింపులకు గురవుతున్న బాలలపట్ల, మహిళల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా ధైర్యం కల్పించాలి, ఎప్పటికప్పుడు న్యాయ సహాయం అందించాలి, వైద్యం, మానసిక ధైర్యం కల్పించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, పట్టణాలు, కాలనీలలో భద్రత చట్టాల అమలు గురించి, పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య, ఆర్ఎస్ఐ సురేష్, భరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, షీటీమ్స్ ఎస్ఐ నీలిమ, ఏఎస్ఐలు సైదాబి, భరోసా సెంటర్, షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** పెరుగుతున్న ధరల నియంత్రణకై జూన్ 10న కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతులు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని విమర్శించారు. అచ్చేదిన్ వస్తాయని చెప్పి సామాన్య మధ్య తరగతి కుటుంబాల జేబులు చిల్లులు పెడుతున్నారని అన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు.

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండవసారి భారత లవ కుమార్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా రెండవసారి భారత లవ కుమార్‌ను నియమిస్తూ సోమవారం విప్ బీర్ల ఐలయ్య ద్వారా భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ సోమవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు పట్టణ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన లవకుమార్ కు జిల్లా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి సహకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కల్లెం రాఘవరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, మండల నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, మలిపెద్ది అమరేష్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నక్ష సర్వేతో ఆస్తులకు గుర్తింపు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే ద్వారానే ప్రజల ఆస్తులకు, భూములకు ఖచ్చితమైన గుర్తింపు లభించడంతో పాటు పూర్తి స్థాయి భద్రత లభిస్తుందని సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజ్ స్పష్టం చేశారు. మిర్యాలగూడ పట్టణ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, సర్వే, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన నక్ష సర్వే ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే పైలట్ ప్రాజెక్ట్‌గా మిర్యాలగూడ పట్టణాన్ని ఈ సర్వే కొరకు ఎంపిక చేయడం ఎంతో హర్షణీయమన్నారు. సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ, చిత్తశుద్ధితో పనిచేసి రాబోయే జూలై మాసాంతానికి సర్వే ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్ సర్వే సిబ్బందికి పలు సాంకేతిక సూచనలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమగ్ర సమీక్షా సమావేశంలో సర్వేయర్ శ్రీనివాస్, అధికారులు శ్రీనివాసరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన లవణం శ్రీను అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. మృతదేహాన్ని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాల్వేరు అశోక్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ రూ.5000ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, డీసీఎంఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేష్, లవణం సాయి, లవణం పాండు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎంజియులో లైబ్రరీ ఎట్ యువర్ కాలేజ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:**గ్రంథాలయ వనరులను విద్యార్థులకు నేరుగా అందించే లక్ష్యంతో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం లైబ్రరీ అట్ యువర్ కాలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి ప్రేమ్‌సాగర్ తెలిపారు.ఇందులో భాగంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుస్తకాలను అందుబాటులో ఉంచారు.పోటీ పరీక్షలు,పరిశోధన,సాహిత్య,అకడమిక్ పుస్తకాలను విద్యార్థులు,అధ్యాపకులు పరిశీలించి ఎంపిక చేసుకున్నారు.విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించేందుకే ఈకార్యక్రమం అని ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజి రెడ్డి,ప్రిన్సిపాల్స్ ఆచార్య శ్రీదేవి, డాక్టర్ కె.అరుణ ప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారిణిని అభినందించిన డిఇఒ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2025/26లో తైక్వాండో బాలికల అండర్17,32 కేజీల విభాగంలో నేషనల్ పార్టిసిపెంట్‌గా ఎంపికైన చేతి విష్ణుశ్రీని జిల్లా విద్యాశాఖాధికారి పి.సుశిందర్ రావు అభినందించారు. ఇటానగర్,అరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న నేషనల్ స్కూల్ గేమ్స్‌కు విష్ణుశ్రీ ఎంపికైంది.ఎస్జీఎఫ్ సెక్రటరీ దగ్గుబాటి విమల ఆధ్వర్యంలో మంగళవారం విష్ణుశ్రీ,ఆమె తండ్రి చేతి భాను ప్రకాశ్,కోచ్ రాచకొండ శ్రీనివాస్ డీఈఓను కలిశారు.

## నేడు మాన్యంచల్క ఉర్దూ మీడియం పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని మాన్యంచల్క ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ మీడియం) నూతన భవన నిర్మాణానికి రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు.స్థానిక మిర్యాలగూడ రోడ్‌లోని పశువుల దవాఖాన ప్రాంగణంలో గల ఖాళీ స్థలంలో రూ.40 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించనున్న ఈ పాఠశాల భవనం మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషించనుంది.శంకుస్థాపన కార్యక్రమానికి ముందుగా జిల్లా విద్యాశాఖాధికారి పి. సుసీందర్ రావు,మండల విద్యాధికారి కత్తుల అరుంధతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. షాహీన్ తయ్యబ్,టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్ గఫూర్‌లతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

# సమాజాభివృద్ధికి విద్యావ్యవస్థ మూలం

**: జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాజం గాడి తప్పకుండా అభివృద్ధి దిశలో పయనించాలంటే దానికి విద్య వ్యవస్థ మూలమని, అలాంటి విద్యావ్యవస్థ ఉపాధ్యాయులు, అధ్యాపకుల చేతిలో ఒక ఆయుధం లాగా ఉందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉద్బోధించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులు పాత పద్ధతిలో కాకుండా నూతన రీతులలో యువతను మేల్కొల్పి, పిల్లలు ఆకట్టుకునేలా పాఠాలు బోధించి వారిని ఉన్నత స్థితిలో నిలుపాలని సూచించారు. ఒక తరం నుంచి మరో తరానికి మార్పు అనేది అది ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందని గుర్తు చేశారు. విద్యార్థుల జీవితాలను రూపకల్పన చేసే అదృష్టం ఉపాధ్యాయ లోకానికి ఉంటుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ప్రతి ఒక్కరు సంకల్పంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఏఐ, ఆన్‌లైన్ కోర్సెస్, ఫిజిక్స్ వాలా తదితర ఇన్నోవేషన్ విధానంలో బోధన ఉండాలన్నారు. ఇంటర్ ఫలితాలు తగ్గిన దాని గురించి కాకుండా భవిష్యత్తులో ఏలాంటి ప్రణాళికతో ముందుకు సాగుతారనేది ఆలోచించాలని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. ఆయా కళాశాల వారిగా గత సంవత్సరం ఫలితాలపై అధ్యాపకులతో చర్చించి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. డిఐఈఓ బి. సులోచన రాణి మాట్లాడుతూ గత సంవత్సరం మొదటి సంవత్సరంలో 60.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 66.83 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు వివరించారు. ఈ విద్యా సంవత్సరం మరింత ఉన్నతమైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పి. యాదయ్య, రాజమోహన్, వెంకటరమణ రెడ్డి, విజయ నాయక్, హరిప్రసాద్, గీతాబాయి, మృత్యుంజయ, వెంకటరమణలతోపాటు ఆయా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అడ్డగూడూరు ఎంఆర్సిలో ఎల్‌డిఏ క్రాంతి కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి దోపిడీ చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో తాగు నీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల్ విద్యా సదుపాయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ నాయకులు సిహెచ్ వంశీ, ఎస్ సంజయ్, ఎం.మనోజ్ పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని విచారణ కమీషన్ చైర్మన్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్‌కు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిఆర్ఎస్ క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మంగళవారం ఢిల్లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మతం మారినప్పటికి వారి సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోలేదని, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం వారికి కూడా అందేలా ఎస్‌సి హోదా కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివక్ష, అవకాశాల కొరత, విద్య, ఉద్యోగ రంగాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను కమీషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించడం ద్వారా వారికి విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలలో సమాన అవకాశాలు లభిస్తాయని, ఇది సామాజిక న్యాయం సాధనలో కీలక అడుగుగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే విధంగా చొరువ చూపాలని కోరారు.

## ధర్మకర్తల మండలి నియామకం కొరకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలోని శ్రీఉమామహేశ్వర ఆంజనేయ స్వామి దేవస్థానమునకు వంశపారంపర్యంగా ధర్మకర్తల మండలి నియామకం కొరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఇంచార్జి ఈఓ యం.పి. లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఇరవై రోజుల్లో నిర్ణీత దరఖాస్తును సహాయ కమీషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ కార్యాలమునకు పంపాలని పేర్కొన్నారు.



## డిఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించిన ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శాంతినగర్ వద్ద గల సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి కార్యాలయాన్ని జిల్లా ఎస్‌పి కె. నరసింహ మంగళవారం సందర్శించారు. సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను నిశితంగా పరిశీలన చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షించాలని డిఎస్‌పికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో మెరిసిన సాగర్ ఫోటోగ్రాఫర్



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన ప్రముఖ వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ స్వతంత్ర బాబు ప్రతిష్ఠాత్మక పీపీఐఎన్ వెడ్డింగ్ ఐకాన్ అవార్డు2026కు ఎంపికై అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.నల్లగొండ జిల్లా యూనియన్ కెనాన్ ప్రోటీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ కార్యక్రమంలో ఆయన ఈఅవార్డును అందుకున్నారు.వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో స్వతంత్ర బాబు చూపిన అసాధారణ ప్రతిభ, సృజనాత్మక దృక్పథం, అంకితభావం, వినూత్న శైలి, వృత్తిపరమైన నిబద్ధతకు గుర్తింపుగా ఈపురస్కారాన్ని ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో తన ప్రతిభను చాటుకోవడంతో పాటు నాగార్జునసాగర్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు.జిల్లాలో తొలిసారిగా ప్రోటియా వెంకీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌లో భాగంగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ అవార్డు సాధించడం ద్వారా స్వతంత్ర బాబు జిల్లాలోని యువ ఫోటోగ్రాఫర్లకు ఆదర్శంగా నిలిచారని పలువురు పేర్కొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు భరోసా

**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీలో మంగళవారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికయాక్షన్99 కార్యక్రమంలో భాగంగా ఈకార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాగార్జునసాగర్ యూనిట్ ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు మాట్లాడుతూ ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా,జోన్ డీఐజీ మాధవరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయం,ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల పరిధిలో పలు మొక్కలు నాటినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ డ్యాం ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు,ఎస్ఐలు రఘు, వెంకటేశ్వర్లు,ఏఎస్ఐలు పుల్లయ్య, రవీందర్, యూసుఫ్‌తో పాటు జెన్‌కో, సాగర్ డ్యాం ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఓటు నమోదు జాగ్రత్తగా చేపించాలి

**ప్రజాపక్షం/హాలియా:** ఓటు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జాగ్రత్తగా చేపించాలని నల్లగొండ పార్లమెంటరీ సర్ ఇంచార్జ్ శాసనమండలి విప్ బల్మూరు వెంకట్ అన్నారు.మంగళవారం హాలియాలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో బూతు లెవెల్ బి ఎల్ ఏ లకు ఓటు నమోదు పై అవగాహన కల్పించారు. ఓటు నమోదు చేసే సమయంలో బిఎల్ఎలు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన లేకుండా ఓటు నమోదు చేయించవద్దని ఆయన చెప్పారు.ప్రతి ఓటు నమోదు చేసే బాధ్యత బి ఎల్ ఏ లది అని చెప్పారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రకృతి పరిరక్షక సేవకులు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా జల సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమాన్ని నార్కట్‌పల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ శిరీష పాల్గొని ఉపాధి హామీ కూలీల సేవలను కొనియాడారు.వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి. మురికి కాలువలు,ఇంకుడు గుంతలు తీసుకొని వృథా నీటిని భూముల్లోకి మళ్లించే ప్రయత్నం చేయాలి. భూగర్భ జలాలను పెంచడమే మనందరి లక్ష్యం కావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామ పంచాయతీ సర్పంచులు పైళ్ల శ్రీనివాస్ రెడ్డి,మచ్చ ముత్యాలు,సామ మహేశ్వరి,శాంతి రెడ్డి,ముప్పిడి పద్మ, సైదులు,గద్దపాటి శంకర్,వెల్లంల కృష్ణవేణి,లింగారెడ్డి,జాల శంకర్ ప్రసాద్,పంగ పార్వతమ్మ,రమేష్,వార్డు మెంబర్లు,ప్రజలు,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెంకటేష్ యాదవ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ ను నియమిస్తూ సోమవారం విప్ బీర్ల ఐలయ్య ద్వారా భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ సోమవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. తన పట్ల నమ్మకం ఉంచిన ఎమ్మెల్యే, ఎంపీ జిల్లా ప్రజా ప్రతినిధులు పోచంపల్లి మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులకు ఆయన కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన వెంకటేష్ కు జిల్లా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# దివ్యాంగులు ఎవరికీ తక్కువ కాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దివ్యాంగులు ఎవరికీ తక్కువ కాదని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి నిరూపించారని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రెండు రోజులుగా క్లియో స్టేడియంలో దివ్యాంగుల క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు క్రీడలు దోహద పడుతాయన్నారు. ఏడు జిల్లాల నుండి క్రికెట్ జట్టు రావడం ముదవాహమన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డిసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, నాయకులు గుడిపాటి నవీన్, కాంగ్రెస్ నాయకులు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముప్పా రామారావు, డాక్టర్ మునీర్ షరీఫ్, వికలాంగుల ఉద్యోగుల సంఘం నాయకులు కొల సైదులు,ప్రథమ బహుమతి హైదరాబాద్ జట్టు కెప్టెన్ జి. రాజేష్ కుమార్, ద్వితీయ బహుమతి రంగారెడ్డి జిల్లా జట్టు కెప్టెన్ అబ్దుల్ అఖిల్ ఏడు జిల్లాలలు నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల జట్టులు పాల్గొన్నాయి. విహెచ్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్ ఖాన్, పోలాగని మదన్ నాయక్, గంధం వెంకన్న, మల్లేష్, బాలకృష్ణ వెంకటేశ్వర్లు వస్రంనాయక్, పిచ్చయ్యలు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించబడింది. ఈ సమావేశం సీనియర్ సివిల్ జడ్జికమ్‌చైర్మన్ మండల న్యాయ సేవల కమిటీ జి. సబిత అధ్యక్షతన జరిగింది.రాబోయే 20 జూన్ 2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయుటకు అవసరమైన చర్యలు,రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను గుర్తించడం,సంబంధిత పక్షాలకు అవగాహన కల్పించడం,వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ సమయంలో,తక్కువ ఖర్చుతో తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని, సంబంధిత అధికారులు మరియు న్యాయవాదులు సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత సూచించారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష,అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్న కుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. సత్తయ్య,ఎంఎ మజీద్ బార్ అధ్యక్షుడు,ఏజీపీ సుక్కా శ్రవణ్,న్యాయవాదులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా బండారు రాజా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణానికి చెందిన బండారు రాజా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు గతంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ కమిటి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బండారు రాజా మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియమించిన అమరవాది లక్ష్మి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియమాకమైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 20వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పేర్వాల గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ నూతనంగా వి బి జి రామ్‌జి కొత్త పతకాన్ని తీసుకురావడం ఉపాధి హామీ కూలీలకు నష్టం చేసి కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే ఈ చట్టం తీసుకొస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలు రైతులు ఇతర పేదల ప్రజా సమస్యలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 12న తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామంలో జరిగే మహాసభలో చర్చించి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాలకుఈ మహాసభలకు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిఐటియూ మండల నాయకులు ఎడ్ల కాశయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామచంద్రం, వెంకటయ్య, అంజమ్మ, అలివేలు, చిన రాములమ్మ పాల్గొన్నారు.



## మహిళా సాధికారతతోనే అభివృద్ధి

**ప్రజాపక్షం/నకిరేకల్:** మహిళా సాధికారతతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే ఇందిరా మహిళా శక్తి మహాసభకు వెళ్లే మహిళల బస్సును నకిరేకల్‌లో జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళా శక్తి భాగస్వామ్యంతోనే సమాజం, రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు,డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం ప్రభాకర్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మునుగోటి సరిత,నాయకులు పన్నాల రాఘవరెడ్డి, చౌగోని శ్రీనివాస్, వెంకన్న,ఐకేపీ సీసీలు,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశంలో పెరుగుతున్నటువంటి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనంలో సిపిఐ ఛలో కలెక్టరేట్ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే యుద్ధం కారణంగా నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, అయితగాని కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి చేయూత




**ప్రజాపక్షం /హాలియా:** మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చి వారు ఆర్థిక పరిపుష్టి సాధించేలా ముందుకు వెళుతుందని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.మంగళవారం హైదరాబాదులో జరుగుతున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి అనుముల మండలం నుండి మహిళలను ప్రత్యేక బస్సుల ద్వారా ఆ కార్యక్రమానికి తరలించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చిందని తెలిపారు.

## నేడు మండలానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాక

ప్రజాపక్షం/చింతలపాలెం : పౌరసరఫరాల శాఖ, భారీ నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం (నేడు) మండలానికి రానున్నారు. చింతలపాలెం మండలం పాతవెల్లటూరు వద్ద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన, సమీక్ష సమావేశానికి హాజరు కానున్నారు.